


హామీలకే ష్యూరిటీ..
అమలుకు నో గ్యారంటీ!

✓అటకెక్కిన సూపర్ సిక్స్ హామీలు ✓అధికారంలోకి వచ్చి 100 రోజులైనా అమలుకాని పథకాలు ✓మండిపడుతున్న మహిళలు, యువత, నిరుద్యోగులు ✓ప్రజలను మోసగించడంలో తనదైన మార్క్ చూపిస్తున్న చంద్రబాబు ✓గతంలోని ప్రభుత్వం చేసినట్లే చేయాలని డిమాండ్

సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూస్తున్న వారికి కూటమి సర్కార్ షాక్‌ల మీద షాక్‌లిస్తోంది. ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాల పేరుతో హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం ఓ వైపు చేస్తూనే, మరోవైపు రోజుకో మంత్రి నోట ఇప్పట్లో హామీలు నెరవేర్చలేమని అసెంబ్లీ సాక్షిగా చెప్పిస్తున్నారు. ఇంకోవైపు భయమేస్తోందని, ప్రజలే అర్థం చేసుకోవాలని చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఎన్నికలప్పుడు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ అని ఊదరగొట్టిన ఆయనే మళ్లీ తాను పాత మనిషేనని అందరికీ గుర్తు చేస్తున్నారు. హామీలు ఇవ్వడం వరకే ష్యూరిటీ అని అమలుకు నో గ్యారంటీ అని మోసం చేయడంలో తనదైన మార్క్‌ను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పథకాల కోసం గంపెడాశలతో ఎదురుచూస్తున్న వారంతా విస్మయానికి గురవుతున్నారు. బాబును నమ్మి మళ్లీ మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు మధ్య తేడాను గుర్తు చేసుకుంటున్నారు. జగన్ ఉన్నప్పుడే బాగుందని అభిప్రాయపడుతున్నారు. –సాక్షి నెట్‌వర్క్.

కూటమి ఇచ్చిన హామీలు ఇవే..

1. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతీ నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
2. స్కూలుకు వెళ్లే ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు
3. రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం
4. ప్రతీ ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు
5. 18 ఏళ్లు దాటిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500
6. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



'సూపర్' మోసం బాబూ!

రూ.1500 కోసం చూస్తున్నాం..



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయూత పథకం ద్వారా 45 ఏళ్లు దాటిన మహిళకు ఏడాదికి రూ.18,750లు ఇచ్చేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రకటించిన నెలకు రూ.1500 పథకం కోసం ఆశగా చూస్తున్నాం. ఇంతవరకు ఈ పథకం విధివిధానాలు ప్రకటించలేదు. చాలా మోసంలా ఉంది.

తాడ్డి ఉష, నందబలగ, రాజాం మండలం.

భృతి లేదు.. ఉద్యోగమూ లేదు..



నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇంతవరకు ఆ ప్రసక్తే లేదు. 20 లక్షల ఉద్యోగాల భర్తీ అన్నారు.. వాటి గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వడం, వృత్తి నైపుణ్యత గుర్తించి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. వీటిలో ఏ ఒక్కటీ అమలుకాలేదు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి 1.40 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2.60 లక్షల వలంటీర్ల నియామకం ద్వారా ఉద్యోగ కల్పన చేశారు. కూటమి ప్రభుత్వమిది అంతా డ్రామాలా ఉంది.

– కొండపల్లి శేఖర్, కొండగూడేం గ్రామం, సంతకవిటి మండలం.

తల్లికి వందనమేది?



తల్లికి వందనం పథకం ద్వారా చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. గతంలో మాకు రూ.15 వేలు అమ్మఒడి పథకం ద్వారా వచ్చేవి. అవి మా పిల్లలకు నోటుపుస్తకాలు, వస్తుసామగ్రి కొనుక్కునేందుకు ఉపయోగపడేవి. ఇప్పుడు కొత్తగా వచ్చిన కూటమి సర్కారు ఈ పథకం ఈ ఏడాది ఇవ్వనంటోంది. మళ్లీ ఏడాది ఇస్తారో ఇవ్వరో కూడా తెలియదు. చేతి డబ్బులు ఖర్చుపెట్టి మా అబ్బాయికి పుస్తకాలు కొన్నాం.

పుట్టిపు ఉత్తరమ్మ, ఇజ్జిపేట, సంతకవిటి మండలం.

గ్యాస్ సిలిండర్లు వస్తాయని చూస్తున్నాం..



ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తాయని చూస్తున్నాం. ప్రతీ ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లను ఈ ప్రభుత్వం ఇస్తాదని ఆశపడ్డాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎప్పుడిస్తారో కూడా స్పష్టత లేదు. నాలాంటి వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.

– మడపల అలివేలు, వంగర, వంగర మండలం

ఉచిత బస్సు తుస్సేనా..



మహిళలకు సంబంధించి, ఉచిత ఆర్‌టీసీ బస్సు ప్రయాణమూ తుస్సే లాగా ఉంది. ఆ పథకం కూడా ఇప్పట్లో అమలు చేసేలా లేదు. ఈ పథకం అమలైతే టికెట్ తీసుకోకుండా రాజాం, విజయనగరం, విశాఖపట్నం వెళ్లవచ్చని అనుకున్నాం. ఈ పథకం గెలిచిన వెంటనే ప్రారంభిస్తామని చెప్పి, ఇప్పుడు వాయిదా వేశారు. ఇది మోసమే.

– పారిశర్ల పద్మావతి, ఎం.సీతారాంపురం, వంగర మండలం.

ఎన్నికల ముందు చంద్రబాబు ఏమన్నారంటే..

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు రాజాంలోని పాలకొండ రోడ్డులో భారీ బహిరంగ సభను ఏప్రిల్ 24వ తేదీన నిర్వహించారు. అప్పుడు సూపర్ సిక్స్ పథకాల హామీలపై ఊకదంపుడు ఉపన్యాసం చేశారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు అందిస్తామని, ప్రతీ విద్యార్థి చదువుకు ఏడాదికి రూ.15 వేలు మంజూరు చేస్తామని, మహిళలకు ఉచిత ఆర్‌టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ప్రతీ ఇంటికి ఇస్తామని, రైతులకు రూ. 20 వేల సాగు సాయం ఇస్తామని జోరుగా ప్రచారం చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇంతవరకు ఆయా పథకాల్లో ఏ ఒక్క పథకమూ అమలు చేయకపోవడంతో హామీలు నమ్మి మోసపోయామని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు.

–రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి



రాజాం నియోజకవర్గంలో..



రూ.1500ల కోసం 82,990 మంది..


వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో రాజాం నియోజకవర్గంలో 23,712 మంది మహిళలు వైఎస్సార్ చేయూత లబ్ధి పొందారు. వారందరికీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆ పథకం స్థానంలో మహిళలకు ప్రతినెలా రూ.1500లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని సుమారు 82,990 మంది మహిళలకు లబ్ధి జరగాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఆ పథకమే అమలు చేయలేదు.

నిరుద్యోగ భృతి కోసం 72,666 మంది..



నియోజకవర్గంలో సుమారు 72,666 మంది నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం, 20 లక్షల ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి ఇంతవరకు వాటికి సంబంధించి ఎటువంటి విధివిధానాలు తెలియజేయలేదు. కనీసం భరోసా కూడా ఇవ్వలేదు.

38 వేల మంది విద్యార్థులు..



వైఎస్సార్ సీపీ హయాంలో నియోజకవర్గంలో 24,787 మంది తల్లుల ఖాతాల్లో ఏటా రూ.37.18 కోట్ల నిధులు అమ్మఒడి పథకం ద్వారా జమ చేయడం జరిగింది. కూటమి సర్కారు ఇప్పుడు ఆ పథకం స్థానంలో అమ్మకు వందనం తీసుకువచ్చి ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ పథకాన్ని ఈ ఏడాది ఇవ్వట్లేదు అన్నట్లు సభలో తెలియజేయడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని దాదాపు 38 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందాల్సి ఉంది.

83,195 ఇళ్లకు గ్యాస్ సిలిండర్లు..



కూటమి సూపర్ సిక్స్‌లో అందరినీ ఆకట్టుకున్న పథకం ఉచిత గ్యాస్ సిలిండర్లు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ప్రతీ ఇంటికి ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పథకం ప్రస్తావన ఎక్కడా లేదు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని దాదాపు 83,195 గృహాలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందాల్సి ఉంది.

45 వేల మంది రైతులు.. 1200 మంది కౌలురైతులు..



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా సాయం అందించేది. సాగు ఖర్చుల నిమిత్తం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.5 వేల సాయం పడేది. ఇలా ఏడాదికి రూ.13,500లు సాయాన్ని ప్రభుత్వం అందించేది. అయితే కూటమి సర్కారు మాత్రం ఏడాదికి ప్రతీ రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇంతవరకు ఆ సాయం అందలేదు. నియోజకవర్గంలో దాదాపు 45,768 మంది రైతులు, సుమారు 1200 మంది కౌలురైతులు ఉన్నారు. వీరందరికీ ఆ సాయం అందాల్సి ఉంది.

1.42 లక్షల మంది మహిళలు..



మహిళలను ఆకట్టుకునేందుకు చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణాన్ని తెరమీదకు తెచ్చారు. ఇంతవరకు ఈ ఉచిత ప్రయాణానికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. నియోజకవర్గంలో దాదాపు 1.42 లక్షల మందికిపైగా మహిళలు ఉన్నారు. వీరందరూ ఫ్రీ బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఉచిత గ్యాస్ సిలెండర్‌ల కోసం..

బొబ్బిలి నియోజకవర్గంలో మండలాల వారీగా గ్యాస్ వినియోగదారులు..

బొబ్బిలి: 71092	బాడంగి: 11080
రామభద్రపురం: 13897	తెర్లాం: 15375

ఉచిత బస్సు ప్రయాణానికి..

నియోజకవర్గంలోని మహిళల సంఖ్య: 1,12,437

ప్రతీ మహిళకు నెలకు రూ.1500..

నియోజకవర్గంలో 18-45 మధ్య వయసున్న మహిళల సంఖ్య: 90,488

వీరికి నెలకు రావాల్సిన మొత్తం: రూ.1,35,73,20,00

నిరుద్యోగ భృతి:

నియోజకవర్గంలోని 60,176 మంది నిరుద్యోగులున్నారు. వీరికి నెలకు రూ.3 వేల చొప్పున నెలకు రూ.18,05,28,000లు రావాల్సి ఉంది.

ఖరీఫ్ వచ్చినా సాయం లేదు..




గతంలో ఖరీఫ్ ప్రారంభానికి ముందే జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కింద సాగు సాయం ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పింది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నా ఇప్పటివరకు సాగు సాయం అందలేదు. మాకు గతంలో ప్రతీ ఏడాది రూ.13,500లు సాయం అందేది.

–నక్క తిరుపతిరావు, ఖండ్యాం, రేగిడి మండలం.

గత ఐదేళ్లలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, లబ్ధిదారులు, వారికి జరిగిన లబ్ధి వివరాలిలా.. (బొబ్బిలి నియోజకవర్గంలో)

రైతు భరోసా పథకం:



బాడంగి: 8717 మందికి రూ.54.14 కోట్లు, తెర్లాం: 10996 మందికి రూ.70.34 కోట్లు, రామభద్రపురం: 8781 మందికి రూ.52.95 కోట్లు, బొబ్బిలి: 12748 మందికి రూ.81.59 కోట్లు

అమ్మఒడి పథకం:



బాడంగి: 17141 మందికి రూ.2.81 కోట్లు, తెర్లాం: 25006 మందికి రూ.4.09 కోట్లు, రామభద్రపురం: 23260 మందికి రూ.3.80 కోట్లు, బొబ్బిలి: 43632 మందికి రూ.65.45 కోట్లు

ఆశగా ఎదురుచూస్తున్నాం..



తల్లికి వందనం పథకం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. మాది నిరుపేద కుటుంబం. నేను, నా భర్త కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు లిఖిత ఏడో తరగతి, చిన్న కూతురు ఖ్యాతి ఐదో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 చొప్పున ఇస్తే మా ఇద్దరి పిల్లలకు ఏటా రూ.30 వేలు వస్తాయి. ఆ డబ్బులతో వారి చదువులు గట్టెక్కుతాయని చూస్తున్నాం.

–మరడ జ్యోతి, రామభద్రపురం.

అమలుచేయకపోవడం అన్యాయం..



పాఠశాలలు తెరిచి నెలలు గడుస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడం అన్యాయం. మాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేటు పాఠశాలలో చదివినా పథకం ఇస్తామనడంతో వారిని ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున మా ఇద్దరి పిల్లలకు రూ.30 రావాల్సి ఉంది. పథకం అమలుచేయకపోతే పిల్లల చదువులు కష్టమవుతాయి.. త్వరగా అమలుచేయాలని కోరుతున్నాం.

–గొర్లి చంద్రకళ, రామభద్రపురం.

మాట నిలబెట్టుకోవాలి..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. మహిళలకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500 ఎప్పుడిస్తారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రతీ సభ, సమావేశంలోనూ సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఊదరగొట్టారు. అధికారం చేపట్టిన తర్వాత ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. అసలు అమలు చేస్తారా లేదా మోసం చేసే పరిస్థితులే కనిపిస్తున్నాయి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 45 ఏళ్లు దాటిన మహిళలకు ఏటా రూ.18,750 ఇచ్చింది.

–జి.గౌరమ్మ, గృహిణి, తెర్లాం

నిరుద్యోగులను మోసం చేయొద్దు..



నిరుద్యోగులను మోసం చేయొద్దు. 2014లో బాబు వస్తే జాబు గ్యారంటీ అన్నారు.. అప్పట్లో ఎవరికీ జాబు రాలేదన్నారు. అదే తరహాలో నిరుద్యోగులకు ఇప్పుడు ఇచ్చిన నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలు కనిపిస్తున్నాయి. నిరుద్యోగులను మోసం చేస్తే నష్టం తప్పదు. వాస్తవంగా చెప్పాలంటే జగన్ హయాంలోనే సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాల సృష్టి జరిగింది. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి.

–నాని, నిరుద్యోగి, గొల్లపల్లి, బొబ్బిలి.

గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారు..?



ప్రతీ ఇంటికి ఏడాదికి ఉచితంగా ఇస్తామన్న మూడు గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారు.. అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా.. గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారో చెప్పలేదు. ఇచ్చిన హామీని నెరవేర్చాలి, వెంటనే ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేయాలి. నాలాంటి ఎంతోమంది గృహిణులు పథకం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

–ఆర్.ధనం, తెర్లాం.

ఫ్రీ బస్సు ఊసే లేదు..?



మహిళలకు ఉచితంగా ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణమని చంద్రబాబు హామీ ఇచ్చారు. అది ఎప్పటి నుంచో చెప్పడం లేదు. అధికారం చేపట్టి వంద రోజులవుతున్నా ఫ్రీ బస్సు ఊసే లేదు. ఆర్‌టీసీ వారిని అడిగితే ఈ మధ్య లేనట్టుందండీ, లేకుంటే ఈ పాటికే మాకు నిబంధనలు వచ్చేవి అంటున్నారు. అంతా అయోమయంలా ఉంది.

–బంకురు చిన్నమ్మలు, పక్కి, బొబ్బిలి.

రైతులను ఆదుకోవాలి..



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జూన్ నెలలోనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేది. ఇప్పుడు ఆగస్టు వస్తున్నా అధికారంలోని కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. ఇదేనా రైతుకు సాయం అంటే.. అన్నదాతకు సాయం ఏది? మాయమాటలు చెప్పి గద్దెనెక్కడం కాదు.. పేద, మధ్య తరగతి రైతులను ఆదుకోవాలి. అంతా మోసంలా ఉంది.

–ముప్పల గణపతి, పక్కి, బొబ్బిలి మండలం.



సంక్షిప్తంగా...

వరదలోనే చెరకు పంట

రేగిడి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాయన్న చానల్ ఆయకట్టు పొలాలను నీటి ముంచింది. మండలంలో ఆమదాలవలస, పాతచెలికానివలస, కొత్తచెలికానివలస గ్రామాల్లో చెరకు పంట ఇప్పటికీ వరదలోనే ఉన్నాయి. పంటలు దిగుబడి వచ్చే సమయంలో వరద విడిచిపెట్టకపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ఈసందర్భంగా డిమాండ్‌చేశారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

బొబ్బిలి: పట్టణంలోని తారక రామా కాలనీలో జూట్ మిల్ ఎదురుగా ఇంటి ముందు ఉన్న బాదం చెట్టు కూలిపోయింది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షం ఈదురు గాలులకు చెట్టు అక్కడి విద్యుత్ తీగలను రాసుకుంటూ విరిగి పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రమాదం జరగలేదు. చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శివ్వాంలో పింఛన్ల పరిశీలన

వంగర: మండల పరిధి శివ్వాం గ్రామంలో పింఛన్ల పరిశీలన బుధవారం చేపట్టారు. గత నెలలో గ్రామానికి చెందిన టీడీపీ నేత పెన్షన్లు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అప్పట్లో పెన్షన్‌దారులు వ్యతిరేకించడంతో బుధవారం పోలీసుల సమక్షంలో ఎంపీడీఓ లోపింటి త్రినాథ్ ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలు సేకరించారు. 48 పెన్షన్లపై ఫిర్యాదు చేయగా అందులో ఒకరు మరణించారని, 22 మంది పేర్లు పరిశీలించామని, మరో 25 మంది వివిధ కారణాలతో అందుబాటులో లేరని ఎంపీడీఓ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంకర్, మండల పరిషత్ కార్యాలయం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు పెట్టుబడి సాయం అందించాలి

బొబ్బిలి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం అందించాల్సిన పెట్టుబడి సాయం అందించపోవడం రైతులను విస్మరించడమేనని వెంటనే అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. మండలంలోని కారాడ గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఆ సంఘ నాయకులు కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాదాపు పూర్తి కావస్తుందని, ఎరువులు, పురుగు మందులను అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారన్నారు. రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, రైతుకు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో ప్రకటించాలని డిమాండ్‌చేశారు. రైతు సంఘం నాయకులు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటిలో భారీ వర్షం

సంతకవిటి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటలు నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. శ్రీహరినాయుడుపేట, వాసుదేవపట్నం, శంకరపేట, గరికిపాడు తదితర గ్రామాల్లో కురిసిన ఈ వర్షంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేయగా, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్ పోటీలు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బుధవారం మండల స్థాయిలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలో 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ – 14, 17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, చెస్ తదితర ఏడు విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ పొగిరి లెనిన్, పాఠశాల హెచ్‌ఎం సత్యారావులు ప్రారంభించారు. పోటీలను పీడీలు రేణుకాదేవి, అజయ్‌కుమార్, త్రినాథరావు, బంగారయ్య, సుజాత, శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

అదానీకి అండగా టీడీపీ – జనసేన

బొబ్బిలి: విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది బలిదాన ఫలితంగా ఆవిర్భవించిన స్టీల్ ప్లాంట్‌ను మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం అమ్మేందుకే నిర్ణయించిందని, దీనిని మోదీ అదానీకి కట్టబెట్టేందుకు చూస్తున్నారని, దీనిని కూటమిలోని టీడీపీ, జనసేన ఎందుకు అడ్డుకోవడం లేదని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రశ్నించారు. బుధవారం ఇక్కడి రైతు సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం వలన వీరంతా నష్టపోతారన్నారు.

విజయనగరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

బొబ్బిలి: విజయనగరంలో నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకూ జరగనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని న్యాయవాది ప్రసాదరావు ఇంటి వద్ద బుధవారం దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు అలమండ ఆనందరావు, బుగత అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణం, శ్రావణ్‌కుమార్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులైనా హామీల అమలేదీ..!

బొబ్బిలి: రాష్ట్రంలో ప్రభుత్వం మారి వంద రోజులయినా ఇచ్చిన హామీలను అమలు చేసే చర్యలు మాత్రం కనిపించడం లేదని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య అన్నారు. ఈ నెల 24న హలో దళితా!-చలో విజయనగరం పేరిట కలెక్టర్ ఆఫీసు వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు సంబంధించిన పథకాలను కొనసాగించడం లేదన్నారు. హామీలను అమలు చేయడం లేదన్నారు. జైభీమ్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, యర్రారపు ఆనందరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సోరు సాంబయ్య తదితరులు